క్లుప్తంగా

హైస్కూల్‌కు సీలింగ్ ఫ్యాన్ వితరణ


ఎంఈవో-1కు సీలింగ్ ఫ్యాన్ అందజేస్తున్న అబద్ధం

దేవరాపల్లి: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు బుక్ షాప్ యజమాని దాసరి అబద్ధం సీలింగ్ ఫ్యాన్‌ను వితరణ చేశారు. దీన్ని ఎంఈవో-1, హెచ్‌ఎం బి.పడాల్‌దాస్‌కు శనివారం ఆయన అందజేశారు. తన సతీమణి రమణమ్మ జ్ఞాపకార్థంగా ఏటా సేవా కార్యక్రమాలు చేపడుతున్న అబద్ధం తెలిపారు. ఎంఈవోతోపాటు ఉపాధ్యాయులు అభినందించారు.

నేడు మోదమ్మకు కుంకుమ పూజలు


మాడుగుల: శ్రావణ మాసం సందర్భంగా ఉత్తరాంధ్ర ఇలవేల్పు మాడుగుల మోదకొండమ్మ ఆలయంలో ఆదివారం ఉదయం ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు తెలిపారు. భక్తుల దర్శనానికి ఎటువంటి ఇబ్బంది లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు.

రోగులకు పండ్లు, రొట్టెల పంపిణీ


రోగులకు పండ్లు, రొట్టెలు, పాలు అందిస్తున్న ఏపీయూడబ్ల్యూజే నాయకులు

నాతవరం: ఏపీయూడబ్ల్యూజే 67వ వార్షికోత్సవం సందర్భంగా శనివారం స్థానిక పీహెచ్‌సీలో రోగులకు పండ్లు, రొట్టెలు, పాలు అందించారు. ఇక్కడ ప్రాంగణంలో మొక్కలు నాటారు. యూనియన్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ ఏడీ బాబు, నర్సీపట్నం ప్రెస్ క్లబ్ యూనియన్ ఉపాధ్యక్షుడు పైల స్వామినాయుడు, కార్యవర్గ సభ్యులు చింతకాయల గిరిబాబు, హుస్సేన్, విలేకరులు పాల్గొన్నారు.

పెద్దేరు నుంచి 120 క్యూసెక్కులు విడుదల


పెద్దేరు జలాశయం

మాడుగుల: మండలంలో పెద్దేరు జలాశయం నుంచి 120 క్యూసెక్కులు సాగునీరు విడుదల చేస్తున్నామని ఏఈ సుధాకర్‌రెడ్డి తెలిపారు. రెండు రోజుల నుంచి పెద్దేరులోకి ఇన్‌ఫ్లో తగ్గుతున్నా, ఆయకట్టులో 15 వేల ఎకరాలకు సాగునీరు ఢోకా లేదన్నారు. పెద్దేరు గరిష్ట నీటిమట్టం 137 మీటర్లు కాగా, ప్రస్తుతం 135.30 మీటర్ల వద్ద నిలకడగా ఉందన్నారు. జలాశయంలోకి నాలుగు రోజులుగా 200 క్యూసెక్కులు వచ్చే వరద నీరు ప్రస్తుతానికి 50 క్యూసెక్కులకు తగ్గిందని తెలిపారు.

గ్రామాభివృద్ధికి ప్రణాళికలు


పంచాయతీ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీవో పట్నాయక్

కె.కోటపాడు: మండలంలో ఈ నెల 23న నిర్వహించే గ్రామసభలకు గ్రామంలో చేపట్టాల్సిన అభివృద్ధి ప్రణాళికలను సిద్ధం చేయాలని ఎంపీడీవో పట్నాయక్ తెలిపారు. చౌడువాడ పంచాయతీ కార్యాలయాన్ని శనివారం ఆయన సందర్శించారు. కార్యాలయ రికార్డులను పరిశీలించారు. పారిశుద్ధ్యం మెరుగుకు ప్రాధాన్యమివ్వాలన్నారు. పారిశుద్ధ్యం మెరుగుకు ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. మంచినీటి పథకాలు క్లీనింగ్, క్లోరినేషన్‌ను సమయానుగుణంగా చేయించాలని వివరించారు. తడి, పొడి చెత్తను పారిశుద్ధ్య సిబ్బందికి వేరువేరుగా అందించాలన్నారు. ఈవోపీఆర్డీ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి ఎస్.రామునాయుడు పాల్గొన్నారు.


బుచ్చెయ్యపేట: వడ్డాదిలో నినాదాలు చేస్తున్న వైద్యులు, సిబ్బంది


నర్సీపట్నం ఆర్డీవో కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న ఐఎంఏ అసోసియేషన్ వైద్యులు


దేవరాపల్లి పీహెచ్‌సీ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న వైద్యాధికారి పూజ్య మేఘన, వైద్య సిబ్బంది


చోడవరం రూరల్: కొత్తూరులో వైద్యులు, సిబ్బంది నినాదాలు

భగ్గుమన్న వైద్య లోకం

- కోల్‌కతా వైద్యురాలిపై హత్యాచార ఘటనపై నిరసన
- నిందితుల్ని కఠినంగా శిక్షించాలని డిమాండ్

కోల్‌కతాలోని వైద్యురాలి హత్యాచార ఘటనను నిరసిస్తూ ప్రభుత్వ, ప్రైవేటు వైద్యులు ఆందోళన బాట పట్టారు. అన్ని ఆస్పత్రుల్లోనూ వైద్య సేవలను బంద్ చేశారు. ప్లకార్డులు పట్టుకుని ర్యాలీలు నిర్వహించి ప్రధాన కూడళ్లలో మానవహారం చేపట్టి నినాదాలు చేశారు. హత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలని, వైద్యులకు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.


మాకవరపాలెంలో ర్యాలీ చేస్తున్న వైద్యులు, సిబ్బంది

నర్సీపట్నం: కోల్‌కత్తా వైద్యురాలిపై హత్యాచారం చేయడం హేయమైన చర్య అని ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎం.నీలవేణిదేవి పేర్కొన్నారు. ఏరియా ఆస్పత్రి వైద్యులు, వైద్య సిబ్బంది నల్లబాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఆస్పత్రి నుంచి అబిడ్‌సెంటర్ వరకు ర్యాలీగా వచ్చి మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. సెంట్రల్ ప్రొటెక్షన్ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. వైద్యులు లత, రాజు, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

ఐఎంఏ ఆధ్వర్యంలో......

కోల్‌కతాలోని వైద్యురాలి హత్యాచార ఘటనను నిరసిస్తూ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నర్సీపట్నం విభాగం వైద్యులు ఆందోళన బాట పట్టారు. అన్ని ప్రైవేటు ఆస్పత్రుల్లో వైద్య సేవలను బంద్ చేశారు. ఐఎంఏ భవనం నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఆర్డీవో కార్యాలయం ఏవో సూర్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మారుతీకృష్ణ, మహేష్ మాట్లాడుతూ డాక్టర్‌పై హత్యాచారానికి ఒడిగట్టిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ప్రాణాలను కాపాడే వైద్యులను సైతం వదలకుండా హత్యాచారం చేయడం హేయమని వాపోయారు. వైద్యులు నళిని ప్రసాద్, లక్ష్మీకాంత్, మద్దు వెంకటరమణ, గౌతమి, రాజు, అయ్యప్ప పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో..

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో స్థానిక కళాశాలల ఆవరణలో విద్యార్థులు మానవహారంగా ఏర్పడి నిరసన తెలియజేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ మన ప్రాణాలను కాపాడే డాక్టర్‌పై హత్యాచారం చేసి చంపేయటం దారుణమన్నారు. మానవమృగాలను ఉరి తీయ్యాలన్నారు. ఎస్ఎఫ్ఐ నాయకులు గౌతమ్, మోహన్‌సాయి తదితరులు పాల్గొన్నారు.

చోడవరం రూరల్: కోల్‌కతాలోని ఆర్‌జీకార్ మెడికల్ కళాశాల వైద్య విద్యార్థిని హత్యాచార ఘటనను చోడవరం సీహెచ్‌సీ, గవరవరం పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది తీవ్రంగా ఖండించారు. వైద్యులు, సిబ్బంది, ఆశా వర్కర్లు, 108 ఉద్యోగులు శనివారం స్థానిక కమ్యూనిటీ ఆస్పత్రి నుంచి ప్రదర్శనగా కొత్తూరు జంక్షన్‌కు చేరుకున్నారు. అక్కడ మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. సీహెచ్‌సీ వైద్యులు వినయ్‌కుమార్, మల్లికార్జున్, దినేష్, హిమబిందు, రేష్మ, శ్రీనివాస్, గవరవరం పీహెచ్‌సీ వైద్యులు ప్రదీప్, భారతి, సత్యదీపిక, ఎంపీహెచ్ఈవో రవికుమార్, హెల్త్ అడ్వయిజర్ సింహాచలం, సబ్ యూనిట్ ఆఫీసర్ వెంకటరమణ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

మాకవరపాలెం: మండలంలోని బూరుగుపాలెం, మాకవరపాలెం పీహెచ్‌సీల వైద్యులు, సిబ్బంది శనివారం నిరసన చేపట్టారు. స్థానిక పీహెచ్‌సీ నుంచి ఆర్టీసీ బస్టాండు వరకు ర్యాలీ చేసి మానవహారం నిర్వహించారు. వైద్యులపై దాడులను అరికట్టాలని నినాదాలు చేశారు. వైద్యాధికారులు సీతారామలక్ష్మి, శ్రీవిద్య, చరిష్మ, చరణ్, సీహెచ్‌వో అనురాధ, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నాతవరం: మండలంలో నాతవరం, గునుపూడి పీహెచ్‌సీల్లో వైద్య సేవలు నిలిపివేశారు. అనంతరం మెయిన్‌రోడ్డు మీదుగా ర్యాలీగా వెళ్లి స్థానిక ప్రధాన కూడలిలో మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. నాతవరం పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రసన్న మాట్లాడుతూ ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేట: మండలంలో మూడు పీహెచ్‌సీ వైద్య సిబ్బంది నిరసన ర్యాలీలు చేపట్టారు. శనివారం బుచ్చెయ్యపేట, మేజర్ పంచాయతీ వడ్డాది, తురకలపూడి పీహెచ్‌సీల వైద్యులు సంధ్యారాణి, కేవీ కృష్ణ, మౌనిక, రమేష్, వైద్య సిబ్బంది మౌరీష్, త్రిమూర్తులు, కనక మహాలక్ష్మమ్మ, మౌళి, తదితరులు ర్యాలీలు, మానవహారాలు చేపట్టారు. రోగులకు రేయింబవళ్లు సేవలందిస్తున్న వైద్య సిబ్బందిపై అఘాయిత్యాలకు పాల్పడితే ఎలా విధులు నిర్వహించగలమని వాపోయారు. ఆస్పత్రుల్లో అత్యవసరం తప్ప సాధారణ వైద్య సేవలను నిలిపివేశారు.

కె.కోటపాడు/దేవరాపల్లి: కె.కోటపాడులో వైద్య సిబ్బంది ఆందోళన చేపట్టారు. కె.కోటపాడు, దేవరాపల్లి మండలాల్లో సీహెచ్‌సీ, పీహెచ్‌సీల వైద్యాధికారులు, వైద్య సిబ్బంది శనివారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకూ ఓపీ సేవలను నిలుపుదల చేశారు. కె.కోటపాడు సీహెచ్‌సీ నుంచి ర్యాలీగా మూడు రోడ్ల కూడలి వద్దకు చేరుకుని, మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. ఆస్పత్రుల పరిసరాల్లో సీసీ కెమెరాలతోపాటు రోజూ పోలీస్ గస్తీ ఏర్పాటు చేయాలని వైద్యులు నందకిశోర్, సునీల్ సురేష్‌రాజ్ కోరారు. వీరి నిరసన కార్యక్రమానికి సీపీఎం జిల్లా కార్యదర్శి బి.వెంకన్న మద్దతు పలికారు. సీహెచ్‌సీ వైద్యులు కుసుమ, ప్రశాంత్, సురేంద్ర, చౌడువాడ, లంకవానిపాలెం, దేవరాపల్లి, వేచలం పీహెచ్‌సీల వైద్యాధికారులు నిర్మల, శైలజ, పూజ్య మేఘన, హారిక, ఏపీ ఎన్జీవో నాయకుడు జావ్వాది సన్యాసిరావు పాల్గొన్నారు. దేవరాపల్లి పీహెచ్‌సీ ఎదుట వైద్య సిబ్బంది నిరసన చేపట్టారు.


కె.కోటపాడు: నిందితులను శిక్షించాలని డిమాండ్ చేస్తున్న వైద్య సిబ్బంది


నాతవరం: ఆందోళన చేస్తున్న వైద్యాధికారులు, వైద్య సిబ్బంది

కొవ్వొత్తులతో ప్రైవేటు వైద్యుల నిరసన

బుచ్చెయ్యపేట: కోల్‌కతాలో ప్రభుత్వ జూనియర్ డాక్టర్‌పై హత్యాచార చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ప్రైవేటు వైద్యులు, జేఏసీ నేతలు డిమాండ్ చేశారు. శనివారం రాత్రి వడ్డాదిలో కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ నిర్వహించారు. చెరుకు కాటా నుంచి నాల్గు రోడ్ల జంక్షన్ వరకు ర్యాలీ సాగింది.

ప్రజల మన్ననలు పొందేలా సేవలు

బుచ్చెయ్యపేట: అధికారులు ప్రజల మన్ననలు పొందేలా సేవలందించాలని వైస్ ఎంపీపీ దొండా లలితా నారాయణమూర్తి, మాజీ వైస్ ఎంపీపీ దాడి సూరి నాగేశ్వరరావు తెలిపారు. ఇటీవల ఉత్తమ అధికారిగా అవార్డు పొందిన వడ్డాది ఈవో లవరాజును శనివారం పాలక వర్గ సభ్యులు ,పంచాయతీ స్వీపర్లు, నాయకులు ఘనంగా సన్మానించారు. మేజర్ పంచాయతీ అభివృద్ధికి పార్టీలకు అతీతంగా పని చేస్తున్న ఈవో లవరాజు సేవలను కొనియాడారు. సర్పంచ్ కోరుకొండ కామలక్ష్మి సూరి అప్పారావు, ఎంపీటీసీలు కోరుకొండ లీలావతి రమణ, నాయకులు, వార్డు మెంబర్లు దొండా నరేష్, గుమ్మిడి ప్రసాద్, గరికిపాటి బాలాజీ, అడపా అప్పమ్మ, బొబ్బరి ఈశ్వరరావు పాల్గొన్నారు.


వడ్డాదిలో లవరాజును సత్కరిస్తున్న నాయకులు

అన్నదాన సత్రం నిర్మాణానికి శంకుస్థాపన

మాడుగుల రూరల్: మండలంలోని కె.జె.పురం జంక్షన్‌లో సంతోషిమాత ఆలయం వద్ద అన్నదాన సత్రం పక్కా భవన నిర్మాణానికి ఆలయ కమిటీ అధ్యక్షుడు కాళ్ల అమ్మతల్లినాయుడు, మాలధారణ భక్తులు శనివారం ఉదయం శంకుస్థాపన చేశారు. దీని భవన నిర్మాణానికి భక్తులు విరాళాలు అందించి సహకరించాలని కమిటీ చైర్మన్ కోరారు. దాతలు 9849697916 ఫోన్ పే ద్వారా తమ విరాళాలు పంపించాలని తెలిపారు.

మొక్కలు నాటిన జర్నలిస్టులు

నర్సీపట్నం: ఏపీయూడబ్ల్యూజే ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని జర్నలిస్టులు, సోషల్ ఫారెస్టు వారి సౌజన్యంతో స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఏవో సూర్యనారాయణ, టౌన్ ఎస్సై ఉమామహేశ్వరరావు మొక్కలు నాటారు. యూనియన్ రాష్ట్ర నాయకులు సిహెచ్.బి.ఎల్.స్వామి, చింతల కిషోర్‌కుమార్, ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి బేరా చినబాబు, సోషల్ ఫారెస్టు రేంజర్ సుబ్బారావు, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

రోలుగుంట: ఏపీయూడబ్ల్యూజే వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ఎంపీపీ పాఠశాలలో విద్యార్థులకు వ్యాస రచన పోటీలను నిర్వహించారు. విజేతలకు ఎంఈవో-2 పి.జగ్గారావు పెన్నులు పంపిణీ చేశారు. విలేకరులు బి.ఎ.ఆనందం, జి.తమ్మున్నాయుడు, కశిరెడ్డి వెంకటరమణ, సలీం, కృష్ణ, ఈశ్వరరావు పాల్గొన్నారు.


మొక్కలు నాటుతున్న ఏవో సూర్యనారాయణ, ఎస్సై ఉమామహేశ్వరరావు, జర్నలిస్టులు

ఇంటింటికీ కుళాయి నీరు రాలేదు

- మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీటీసీలు

మాడుగుల: ఇంటింటికీ కుళాయి నీరు సక్రమంగా రాలేదని పలువురు ఎంపీటీసీలు సభ దృష్టికి తీసుకువచ్చారు. ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్ అధ్యక్షతన శనివారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీటీసీ పొలిమేర విజయలక్ష్మి మాట్లాడుతూ స్థానిక ప్రభుత్వాస్పత్రిలో డెంటల్, ఈఎన్‌టీ వైద్యులను ఏర్పాటు చేయాలని, గవర వీధిలో తాగునీటి సమస్య పరిష్కరించాలని సభ దృష్టికి తీసుకువచ్చారు. కోఆప్షన్ మెంబరు షేక్ ఉస్నీషా మాట్లాడుతూ స్థానిక దుర్గాలమ్మ ఆలయం ఎదురుగా మాంసం దుకాణాల వ్యర్థాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, పక్కనే ట్యాంకు నుంచి వస్తున్న తాగునీరు కలుషితమయ్యే అవకాశం ఉందని, పంచాయతీ అధికారులు స్పందించి పరిష్కరించాలని కోరారు. ఎంపీపీ రాజారామ్ మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా సర్పంచ్‌లు, ఎంపీటీసీల సహకారంతో మండలాన్ని అభివృద్ధి చేద్దామన్నారు. నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వాస్పత్రిలో స్థల దాతలు పేర్లతోపాటు మహనీయుల ఫొటోలు ఏర్పాటు చేసుకుందామన్నారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయని, ప్రజలతోపాటు వైద్యాధికారులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. సభలో జూనియర్ డాక్టరు హత్యను ఖండిస్తూ కొంతసేపు మౌనం పాటించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కాశీప్రసాద్, తహసీల్దార్ పీవీరత్నం, వైద్యాధికారులు చంద్రశేఖర్, లీలాప్రసాద్, మాలెంనాయుడు, సర్పంచ్ ఎడ్ల కళావతి, ఎంపీటీసీ కుక్కర మహేశ్వరి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీపీ రాజారామ్ తదితరులు

సజావుగా స్కూల్ కమిటీ ఎన్నికలు


నర్సీపట్నం జెడ్పీ హైస్కూల్‌లో ఎన్నిక నిర్వహిస్తున్న హెచ్‌ఎం రత్నం, ఉపాధ్యాయులు


రోలుగుంటలో ఎన్నికైన కమిటీతో ప్రమాణస్వీకారం చేయిస్తున్న హెచ్.ఎం. ప్రసాద్


చోడవరం రూరల్: ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు ఎన్నికైన వైఎస్సార్‌సీపీ మద్దతు కమిటీ


మాకవరపాలెం: రామన్నపాలెంలో చైర్మన్, వైస్ చైర్మన్‌లను అభినందిస్తున్న వైస్ ఎంపీపీ


దేవరాపల్లి:మామిడిపల్లిలో చైర్మన్‌ను అభినందిస్తున్న జెడ్పీటీసీ కర్రి సత్యం, సర్పంచ్ సూరినాయుడు

నర్సీపట్నం: ప్రభుత్వ పాఠశాలల్లో స్కూల్ కమిటీ ఎన్నికలు సజావుగా సాగాయి. మండలంలో 37 ప్రాథమిక పాఠశాలలు, 17 హైస్కూల్స్‌కు శనివారం ఎన్నికలు జరిగాయి. మెట్టపాలెం ప్రాథమిక పాఠశాలలో కోరం లేక ఎన్నిక వాయిదా పడింది. డాక్టరు బి.ఆర్.అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో బీసీ సభ్యుడు ఎన్నిక విషయంలో సభ్యుల మధ్య ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. విషయం తెలుసుకున్న ఎంఈవో సిహెచ్.తలుపులు అక్కడకు చేరుకుని ఇరువర్గాలకు సర్దిచెప్పడంతో వివాదం సద్దుమణగడంతో చైర్మన్‌గా మొలిపాక శివను ఎన్నుకున్నారు.

5 పాఠశాలల్లో ఎన్నికల వాయిదా

బుచ్చెయ్యపేట: మండలంలో పలు గ్రామాల పాఠశాల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల బెదిరింపులకు పాల్పడ్డారు. శనివారం జరిగిన స్కూల్ పేరెంట్స్ కమిటీ(ఎస్ఎంసీ) ఎన్నికల్లో తమ పార్టీ మద్దతు కలిగిన అభ్యర్థులను గెలిపించకపోతే ప్రభుత్వ పథకాలు నిలిచిపోతాయని విద్యార్థుల తల్లిదండ్రులను బెదిరించారు. కొన్ని పాఠశాలల్లో టీడీపీ, జనసేన నాయకులు పోటీ పడి గొడవలకు దిగబోయారు. పలు గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులను అడ్డుకుని అధికారులను బెదిరించి ఎన్నికలు వాయిదా వేయించారు. మండలంలో మొత్తం 62 పాఠశాలలకు గాను 39 ఏకగ్రీవం కాగా, 18 చోట్ల ఎన్నికలు జరిగాయి. 5 పాఠశాలల్లో గొడవలు వల్ల ఎన్నికలు వాయిదా వేశారు. ఐయితంపూడి పాఠశాలలో 4వ తరగతిలో వైఎస్సార్‌సీపీ అనుకూలంగా ఎక్కువగా మెంబర్లు ఉండటంతో కూటమి నాయకులు గొడవ చేసి ఎన్నిక వాయిదా పడేలా చేశారు. కొత్త కొండెంపూడిలో 15 మందికి గాను ఏడుగురు వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులు గెలవగా, మిగిలిన ఎన్నికలను టీడీపీ నాయకులు వాయిదా వేసేలా చేశారు. ఫంగిడిలో 28 మంది సభ్యులగాను 15 మంది వైఎస్సార్‌సీపీకి అనుకూలంకాగా, కూటమి నేతల బెదిరించి తమకు అనుకూల వ్యక్తిని గెలిపించుకున్నారని సర్పంచ్ గోకివాడ వరకృష్ణ, విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

మాడుగుల రూరల్: మండలంలో 67 పాఠశాలలకు గాను 65 పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు నిర్వహించారు. జి. అగ్రహారం ఎంపీపీ పాఠశాల, హైస్కూలులో ఎన్నికలు వాయిదా పడ్డాయని ఎంఈవో బి. దేముడమ్మ తెలిపారు.

కె.కోటపాడు: మండలంలోని అన్ని పాఠశాలల్లో డైరెక్టర్లు, చైర్మన్, వైస్ చైర్మన్ల ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. గవరపాలెం పాఠశాల చైర్మన్‌గా జాన సన్యాసమ్మ, మల్లంపాలెం పాఠశాలలో జాగరపు కన్నంనాయుడు, ఎ.కోడూరు హైస్కూల్‌లో కిల్లి సింహాచలంనాయుడు, ఆర్.వై.అగ్రహారంలో విస్సారపు గోవింద ఎన్నికయ్యారు.

దేవరాపల్లి: మండలంలో 44 పాఠశాలల్లో ఏకగ్రీవం కాగా, 11 చోట్ల ఎన్నికలు నిర్వహించారు. తెనుగుపూడిలో బాలుర గురుకుల విద్యాలయంలో కోరం లేకపోవడంతో ఎన్నిక వాయిదా వేశారు. ఎ.కొత్తపల్లిలో హైస్కూల్ చైర్మన్‌గా లక్కరాజు అప్పలనర్సమ్మ, ఎంపీపీ స్కూల్ చైర్మన్‌గా గనివాడ శివాజీ, అచ్చియ్యపాలెం ఎంపీపీ స్కూల్ చైర్మన్‌గా పెద్దాడ గణేష్ వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు ఎన్నికయ్యారు. మామిడిపల్లిలో ఎంపీపీ స్కూల్ చైర్మన్‌గా కర్రి కమల, వైస్ చైర్మన్‌గా సమ్మింగ సంతోష్ వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు ఎన్నిక కాగా, జెడ్పీటీసీ కర్రి సత్యం, సర్పంచ్ కర్రి సూరినాయుడు, ఉప సర్పంచ్ చల్లా సుధాకర్, ఎంపీటీసీ పంచాడ సింహాచలంనాయుడు సత్కరించారు. వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు పెదనందిపల్లి హైస్కూల్ చైర్మన్‌గా చప్పా అప్పలనాయుడు, ఎంపీపీ స్కూల్ చైర్మన్‌గా ఆబోతు రమణ, బోయిలకింతాడ కొత్తూరులో ఎంపీపీ స్కూల్ చైర్మన్‌గా బొబ్బిలి త్రిమూర్తులు, వేచలం ఎంపీపీ స్కూల్ చైర్మన్ వేచలపు జగ్గారావు గెలుపొందారు.


గొలుగొండ: చీడిగుమ్మల హైస్కూల్లో కమిటీలు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

రెండు పాఠశాలల్లో వాయిదా

నాతవరం: మండలంలో 61 పాఠశాలలకుగాను 59 చోట్ల ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని ఎంఈవో-2 కామిరెడ్డి వరహాలబాబు తెలిపారు. పి.కె.గూడెం, కురువారం పాఠశాలల్లో కోరం లేక ఎన్నికలు వాయిదా వేశామన్నారు. నాతవరం హైస్కూల్‌లో వైఎస్సార్‌సీపీ, టీడీపీ శ్రేణుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఎస్ఐ రామారావు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించారు.

రోలుగుంట: మండలంలో 44 ఎంపీపీ పాఠశాలలకు గాను 38 ఏకగ్రీవం కాగా, అయిదు ఎన్నికలు జరగ్గా కొంతలం జెడ్పీ ఉన్నత పాఠశాల ఎన్నిక వాయిదా పడిందని ఎంఈవో-2 పి.జగ్గారావు తెలిపారు. రోలుగుంట జెడ్పీ ఉన్నత పాఠశాల చైర్మన్ కొయ్యా సత్తిబాబును, బుచ్చింపేట జెడ్పీ ఉన్నత పాఠశాల గౌరవాధ్యక్షుడిగా అనిమిరెడ్డి రమణను అభినందించారు.

గొలుగొండ: మండలంలో 60 పాఠశాలలు ఉండగా 48 చోట్ల ఏకగ్రీవం కాగా, మిగతా 12 చోట్ల ఎన్నికలు నిర్వహించారు. ఎక్కడా ఎటువంటి వివాదాలు లేకుండా కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయని ఎంఈవో సత్యనారాయణ తెలిపారు.

చోడవరం రూరల్: మండలంలోని 42 ప్రాథమిక పాఠశాలలకు గాను 34 స్థానాలు, ఐదు ప్రాథమికోన్నత పాఠశాలలకు గాను మూడింట 14 ఉన్నత పాఠశాలల్లో 9 యాజమాన్య కమిటీల ఎన్నిక ఏకగ్రీవమయ్యాయి. ఏడు ప్రాథమిక, రెండు ప్రాథమికోన్నత, ఐదు ఉన్నత పాఠశాలల కమిటీలకు మాత్రం ఎన్నిక అనివార్యం కాగా, కోరం లేక ఒక ప్రాథమిక పాఠశాల కమిటీ ఎన్నిక వాయిదా పడింది. లక్ష్మీపురం, దామునాపల్లి వంటి చోట్ల చెదురుముదురు ఘటనలు చోటుచేసుకున్నప్పటికీ ఎన్నిక పూర్తి చేశారు. నంబారువాని పాలెం పాఠశాల కమిటీ ఎన్నికకు కోరం చాలకపోవడంతో వాయిదా వేసినట్టు ఎంఈవో సింహాచలం తెలిపారు. పట్టణ పరిధిలోని గాంధీగ్రామం పాఠశాల కమిటీని వైఎస్సార్‌సీపీ మద్దతుదారు కైవసం చేసుకున్నారు. కారు శ్రీను చైర్మన్‌గా ఎన్నికయ్యారు. లక్ష్మీపురం పాఠశాలలో ఆరుగురు గెలిచినప్పటికీ చివరి క్షణంలో ఒకరు కూటమి వైపు తిప్పుకుని చైర్మన్, వైస్ చైర్మన్లు తమ వారని అధికార పార్టీ అనిపించుకుంది. దామునాపల్లిలో ఇదే రకమైన రగడ చోటు చేసుకుంది. రామజోగిపాలెంలో వైఎస్సార్‌సీపీ మద్దతుదారు కైవసం చేసుకున్నారు.

చీడికాడ: మండలంలో 52 పాఠశాలల్లో ఎన్నకలు ప్రశాంతంగా ముగిసినట్లు ఎంఈఓ-1 బొంజుబాబు తెలిపారు. 43 పాఠశాలలు ఏకగ్రీవంకాగా, 9 చోట్ల ఎన్నికలు నిర్వహించారు.

మాకవరపాలెం: మండలంలోని 51 పాఠశాలల్లో కమిటీ ఎన్నికలు జరిగాయని ఎంఈవో పి.ఎస్.ఎన్.మూర్తి తెలిపారు. బూరుగుపాలెం, కొండలఅగ్రహారంలో ఎన్నికలు వాయిదా పడ్డాయన్నారు. రామన్నపాలెం , బూరుగుపాలెం, గిడుతూరు ప్రాథమిక పాఠశాలల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు కమిటీలను చేజిక్కించుకున్నారు.


కె.కోటపాడు: ఆర్.వై.అగ్రహారం పాఠశాల చైర్మన్ గోవింద ప్రమాణస్వీకారం


ముకుందపురం పాఠశాల చైర్మన్ రామలక్ష్మి, వైస్ చైర్మన్ ముసిలినాయుడిని అభినందిస్తున్న దృశ్యం


గెలుపొందిన చైర్మన్, వైస్ చైర్మన్లతో వైఎస్సార్‌సీపీ నేతలు